పార్లమెంట్ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ, డిసెంబర్ 21: పార్లమెంట్ ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్ సభలో దుండగుల అలజడి.. అసాధారణ రీతిలో 146 మంది విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు.. తదితర పరిణామాల మధ్య షెడ్యూల్ కంటే ఒక రోజు ముందే పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగిశాయి. చివరి రోజు లోక్సభలో మరో ముగ్గురు ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. విపక్ష ఎంపీల గైర్హాజరీలో పలు కీలక బిల్లులను కేంద్రం ఆమోదింపజేసుకున్నది. బ్రిటిష్ కాలం నాటి ఐపీసీ, సీఆర్పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో తీసుకొచ్చిన 3 నేర న్యాయబిల్లులు, టెలికం బిల్లు, సీఈసీ, ఈసీ నియామకాలకు సంబంధించిన బిల్లులు ఈ జాబితాలో ఉన్నాయి.

షెడ్యూల్ కన్నా ఒక రోజు ముందే ముగిసిన శీతాకాల సమావేశాలు

- చివరి రోజు ముగ్గురు ఎంపీల సస్పెన్షన్..మొత్తం 146 మందిపై వేటు
- నేర న్యాయ బిల్లులు, టెలికమ్యూనికేషన్ బిల్లు, సీఈసీ, ఈసీ నియామకాల బిల్లులకు పార్లమెంట్ ఆమోదముద్ర
- ఎంపీల సస్పెన్షన్‌పై విపక్షాల ఆగ్రహం..విజయ్‌చౌక్‌కు మార్చ్

ప్రతిపక్షాలకు చెందిన ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం పార్లమెంట్ నుంచి విజయ్‌చౌక్ వరకు ర్యాలీగా వెళ్తున్న విపక్ష ఎంపీలు

విపక్షాల నిరసన మార్చ్

పార్లమెంట్‌లో విపక్షాల గొంతును మోదీ సర్కార్ అణచివేస్తున్నదని విపక్ష ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పార్లమెంట్ నుంచి విజయ్ చౌక్‌కు పాదయాత్రను చేపట్టారు. సేవ్ డెమొక్రసీ, పార్లమెంట్ కేజ్‌డ్, డెమొక్రసీ ఎక్స్‌పెల్డ్.. సందేశాల్ని చూపుతూ ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మాట్లాడుతూ, 'భద్రతా వైఫల్యం అంశాన్ని సభలో లేవనెత్తకుండా ప్రధాని మోదీ విపక్ష ఎంపీల పార్లమెంటరీ హక్కుల్ని కాలరాశారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో మాట్లాడకుండా ప్రధాని మోదీ, అమిత్ షాలు తప్పించుకుంటున్నారని ఆరోపించారు. సభలో ప్రధాని మాట్లాడకపోవటం సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్టేనని ఖర్గే అన్నారు. శుక్రవారం జంతర్‌మంతర్ వద్ద నిరసన కొనసాగిస్తామని విపక్ష ఇండియా కూటమి ప్రకటించింది.

కీలక బిల్లులకు పార్లమెంట్ ఆమోదం

ఉభయ సభల్లో 146 మంది విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు వేసిన కేంద్ర ప్రభుత్వం.. పలు కీలక బిల్లులను ఆమోదింపజేసుకున్నది. లోక్ సభ ఇప్పటికే ఆమోదించిన భారతీయ న్యాయసంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం బిల్లులకు గురువారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. గురువారం రాజ్యసభలో చర్చ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మాట్లాడుతూ.. ఈ బిల్లుల ద్వారా బాధితులకు మూడేండ్లలోగా న్యాయం దక్కుతుందని చెప్పారు. మరోవైపు, జాతీయ భద్రత పేరుతో ఏ మొబైల్ నెట్‌వర్క్‌ను అయినా టేకోవర్ చేసుకునేందుకు లేదా సస్పెండ్ చేసేందుకు కేంద్రానికి అధికారం కల్పించే టెలికమ్యూనికేషన్ బిల్లుకు కూడా పార్లమెంట్ ఆమోదముద్ర వేసింది. అలాగే సీఈసీ, ఈసీల నియామక ప్యానల్ నుంచి సీజేఐని తొలగించే బిల్లుకూ పార్లమెంట్ ఆమోదం తెలిపింది.

దుమారం రేపిన భద్రతా వైఫల్యం ఘటన

ఈ నెల 4న శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. 13న ఇద్దరు దుండగులు విజిటర్స్ గ్యాలరీ నుంచి లోక్‌సభలోకి దూకి, పొగ వదిలి అలజడి సృష్టించడం కలకలం రేపింది. దీనిపై కేంద్ర హోం మంత్రి ప్రకటన చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో సభ నిర్వహణకు ఆటంకం కలిగిస్తున్నారని పేర్కొంటూ కేంద్రం ఏకంగా 146 మంది ప్రతిపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు వేసింది.

24 గంటల్లో 594 కరోనా కేసులు

వైరస్‌తో ఆరుగురి మృతి



న్యూఢిల్లీ, డిసెంబర్ 21: దేశంలో కరోనా కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. గత 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా 594 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయని, ఆరుగురు చనిపోయారని అధికారులు తెలిపారు. దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 2,669కి చేరుకుందని, రికవరీ రేటు 98.81 శాతంగా, మరణాల రేటు 1.19 శాతంగా ఉందని చెప్పారు. మరోవైపు, ప్రస్తుతానికి విమానాశ్రయాల్లో ప్రయాణికులకు ఆర్‌టీ-పీసీఆర్ టెస్టును తప్పనిసరి చేసే ఆలోచన లేదని కేంద్ర ఆరోగ్య శాఖ వర్గాలు గురువారం వెల్లడించాయి. కరోనా కేసులు, జేఎన్.1 ఉప రకం కేసులు దేశంలో పెరుగుతున్నప్పటికీ బాధితుల్లో చాలా మంది స్వల్ప అనారోగ్యంతో ఇంట్లోనే చికిత్స తీసుకుంటున్నారని తెలిపాయి. కొవిడ్ వల్ల దవాఖానల్లో చేరుతున్న వారి రేటులో పెరుగుదల లేదని పేర్కొన్నాయి.

మరాఠా కోటా కోసం మరో యువకుడి బలిదానం

ముంబై, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ): మరాఠా కోటా కోసం మరో యువకుడు బలిదానం చేశాడు. శీతాకాల సమావేశాల్లో మరాఠా రిజర్వేషన్లకు సంబంధించి ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయం తీసుకోక పోవడంతో, ఆందోళనకు గురైన ఒక యువకుడు పొలంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పోతబుద్రుక్‌లో జరిగింది. మృతుడి పేరు యోగేశ్ కుండ్లిక్ లోన్ సన్నే(21) అని పోలీసులు తెలిపారు. యోగేశ్ పర్భానిలోని ఓ కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మరాఠా రిజర్వేషన్ ఉద్యమంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. హింగోలిలో మనోజ్ జరాంగే పాటిల్ సమావేశంలో అతను వలంటీర్‌గా కూడా పనిచేశాడు.

రాహుల్‌పై సత్వరం చర్యలు తీసుకోండి: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: ప్రధానిపై వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై 8 వారాల్లోగా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ)ని ఢిల్లీ హైకోర్టు గురువారం కోరింది. భరత్ నాగర్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ జరిపిన హైకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. పిటిషన్‌లో తెలిపిన వివరాల ప్రకారం, గాంధీ గత నెల 22న ఓ బహిరంగ సభలో మాట్లాడుతూ, ప్రధాని మోదీని జేబుదొంగ అని ఎద్దేవా చేశారు. ఆయనకు ఈసీ గత నెల 23న నోటీసు ఇచ్చి, గత నెల 26లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ గడువు ముగిసినప్పటికీ ఆయనపై ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

జనవరి 29 నుంచి అమెరికాలోనే హెచ్1బీ రెన్యువల్

తొలిదశలో భారతీయులు, కెనడియన్లకే అవకాశం

ముంబై, డిసెంబర్ 21: హెచ్1బీ వీసాదారులు అమెరికాలోనే తమ వీసాను రెన్యువల్ చేసుకునే పైలట్ ప్రాజెక్టును వచ్చే ఏడాది జనవరి 29న ప్రారంభించనున్నట్టు అమెరికా వెల్లడించింది. తొలి దశలో భారత్, కెనడాకు చెందిన 20 వేల మందికి అవకాశం కల్పించనున్నట్టు తెలిపింది. జనవరి 29 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు హెచ్1బీ వీసాదారులు యూఎస్‌లోనే తమ వీసాలను రెన్యువల్ చేసుకోవచ్చు. ప్రతి వారం (జనవరి 29, ఫిబ్రవరి 5, 12, 19, 26 తేదీల్లో) 4 వేల అప్లికేషన్ స్లాట్లను అందుబాటులోకి తెస్తారు. ఇందులో 2 వేలు భారతీయులకు కేటాయించనున్నారు. 2021 ఫిబ్రవరి 1 నుంచి 2021 సెప్టెంబర్ 30 మధ్య మిషన్ ఇండియా జారీచేసిన వీసాలను మాత్రమే రెన్యువల్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు.

సీఐఎస్ఎఫ్ చేతికి పార్లమెంట్ భద్రత!

భద్రతా వైఫల్యం నేపథ్యంలో కేంద్రం యోచన

న్యూఢిల్లీ, డిసెంబర్ 21: కేంద్ర పారిశ్రామిక భద్రతా బలగాల (సీఐఎస్ఎఫ్)తో పార్లమెంట్ భవనానికి పూర్తిస్థాయిలో సమర్థవంతమైన భద్రతను ఏర్పాటుచేసే దిశగా కేంద్రం కసరత్తు చేస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం దేశవ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి తెలిసిందే. దీంతో పాత, కొత్త పార్లమెంట్ భవనాల వద్ద భద్రతా నిర్వహణను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. హ్యాండ్ డిటెక్టర్స్, ఎక్స్-రే మెషీన్లతో పరీక్షలు జరపటం, బూట్లు, దళసరి జాకెట్లు, బెల్ట్‌లు.. మొదలైన వాటిని స్కానర్‌లో పంపటం.. విమానాశ్రయాల వద్ద ప్రయాణికులను స్కానింగ్ చేసినట్టు పార్లమెంట్ భవనం వద్ద భద్రతా చర్యల్ని ఇకపై సీఐఎస్ఎఫ్ చేపట్టే అవకాశముంది. ఇందుకు సంబంధించి సర్వే చేపట్టాల్సిందిగా కేంద్ర హోం శాఖ నుంచి బుధవారం ఆదేశాలు వెలువడ్డాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఢిల్లీ పోలీస్ సిబ్బంది పార్లమెంట్ భవనాల వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్నది. డిసెంబర్ 13న ఇద్దరు వ్యక్తులు లోక్‌సభ గ్యాలరీ నుంచి లోక్‌సభ చాంబర్‌లోకి దూకి అలజడి సృష్టించిన విషయం తెలిసిందే.

మాజీ డీఎస్పీ కుమారుడి అరెస్ట్

పార్లమెంట్ భద్రతా వైఫల్యం కేసులో కర్ణాటకకు చెందిన మాజీ పోలీస్ అధికారి (డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్) కుమారుడు సాయికృష్ణ జాగలిని ఢిల్లీ పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. బాగల్‌కోట్‌లోని అతడి ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. మైసూర్‌కు చెందిన ఇతడు బెంగళూర్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడని, పార్లమెంట్ చొరబాటు కుట్ర కేసులో నిందితుడిగా ఉన్న మనోరంజన్‌కు సాయికృష్ణ స్నేహితుడని పోలీసులు తెలిపారు. కాలేజీ రోజుల్లో మనోరంజన్ రూమ్‌మేట్‌గా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.

బ్లడ్ డిజార్డర్స్ ఉన్న వారికి నో రిజర్వేషన్

పార్లమెంటులో కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ: తలసేమియా, హిమోఫిలియా, సికిల్ సెల్ వంటి రోగాలున్న వారు అంగవైకల్యం గల వ్యక్తుల క్యాటగిరీ కింద ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్లకు అర్హులు కాదని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది. దివ్యాంగుల హక్కుల చట్టం, 2016లోని సెక్షన్ 34 ప్రకారం, ప్రభుత్వ వ్యవస్థల్లో రిజర్వేషన్లను పొందడానికి తలసేమియా వంటి బ్లడ్ డిజార్డర్స్ ఉన్నవారు అర్హులు కాదని కేంద్ర సాంఘిక న్యాయ శాఖ సహాయ మంత్రి ప్రతిమ భౌమిక్ తెలిపారు. ఈ వ్యాధులను చట్ట ప్రకారం అంగవైకల్యం జాబితాలో చేర్చినందువల్ల ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్లు వర్తిస్తాయని ఉద్యమకారులు భావించారు.

తమిళనాడు మంత్రికి మూడేండ్ల జైలు

చెన్నై, డిసెంబర్ 21: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తమిళనాడు ఉన్నత విద్యా శాఖ మంత్రి కే పొన్ముడికి మూడేండ్ల జైలు శిక్ష విధిస్తూ మద్రాస్ హైకోర్టు గురువారం తీర్పు చెప్పింది. ఇదే కేసులో మంత్రి భార్య పి విశాలాక్షికి సైతం మూడేండ్ల కారాగారాన్ని విధించడమే కాక, ఇద్దరూ 50 లక్షల రూపాయల చొప్పున జరిమానా చెల్లించాలని జస్టిస్ జీ జయచంద్రన్ తీర్పు చెప్పారు. 30 రోజుల తర్వాత విల్లుపురం కోర్టులో లొంగిపోవాలని న్యాయమూర్తి ఆదేశించారు. అవినీతి నిరోధక చట్టం కింద మంత్రికి జైలు శిక్ష పడటంతో ఆయన మంత్రి పదవిని కోల్పోవడమే కాక శాసనసభ్యుని పదవికి సైతం అనర్హుడయ్యే అవకాశం ఉందని న్యాయనిపుణులు తెలిపారు.

విపక్షం నోరు నొక్కేందుకే సమన్లు

ఈడీ విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు

న్యూఢిల్లీ, డిసెంబర్ 21: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ గురువారం ఈడీ విచారణకు గైర్హాజరయ్యారు. రాజకీయ ప్రత్యర్థుల నోరు నొక్కేందుకే కేంద్రం ఈడీతో సమన్లు జారీ చేయిస్తున్నదని ఆరోపించారు. ఈడీ జారీ చేసిన సమన్లకు ఆయన బుధవారమే సమాధానమిచ్చారు. ఢిల్లీ సీఎంగా లేదా ఆప్ జాతీయ సమన్వయకర్తగా పిలిచారో సమన్లలో పేర్కొనలేదని తెలిపారు. సమన్లను రద్దు లేదా ఉపసంహరణ లేదా తిరిగి జారీ చేయడమో చేయాలన్నారు. 'సమన్లు హేతుబద్ధంగా లేవు. 2024 పార్లమెంట్ ఎన్నికలకు ముందు సంచలన వార్తలు సృష్టించేందుకు, విపక్షాల నోరు నొక్కేందుకు కేంద్రం ఈడీతో ఈ సమన్లు జారీ చేయిస్తున్నది' అని కేజ్రీవాల్ అన్నారు. తాను చట్టాన్ని గౌరవిస్తానని.. సమన్లు చట్టానికి అనుగుణంగా లేవని ఆయన విమర్శించారు.

యూపీలో రైల్వే, మెట్రో స్టేషన్లలో మద్యం అమ్మకాలు!

లక్నో, డిసెంబర్ 21: రైల్వే, మెట్రో స్టేషన్లు, క్రూయిజ్‌లలో మద్యం అమ్మకాలు చేపట్టాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయంపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. '1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోవడానికి బీజేపీ ప్రభుత్వం వద్ద మిగిలి ఉన్న ఏకైక మార్గం మద్యం అమ్మడం. రేపో మాపో నడిరోడ్లపైనే అమ్మకాలు చేపడుతుందేమో. నా సలహా ఏమిటంటే బీజేపీ కార్యాలయాల్లో కూడా మద్యం అమ్మకాలు చేపడితే ఇంకా బాగుంటుంది' అని అఖిలేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

గవర్నర్ సరిగా పని చేయడం లేదు: విజయన్

తిరువనంతపురం, డిసెంబర్ 21: కేరళ సీఎం పినరాయి విజయన్, గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ మధ్య మాటలు తూటాలు పేలుతూనే ఉన్నాయి. తాజాగా ఆరిఫ్‌పై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీకి విజయన్ ఫిర్యాదు చేశారు. గవర్నర్ తన రాజ్యాంగ విధులను సరిగా నిర్వర్తించడం లేదని, ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారని పేర్కొంటూ లేఖ రాశారు. ఆయన ప్రవర్తన కూడా గవర్నర్ హోదాకు తగ్గట్టు లేదని తెలిపారు. దీనిపై ఓ సారి దృష్టి సారించాలని కోరారు.

నాలుగేండ్ల లోపు పిల్లలకు ఎఫ్‌డీసీ మందులు వాడొద్దు: డీజీసీఐ

న్యూఢిల్లీ: నాలుగేండ్ల లోపు పిల్లల్లో జలుబు నివారణ కోసం ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ)తో తయారయ్యే మందుల వినియోగాన్ని కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ నిషేధించింది. ఈ మేరకు డీజీసీఐ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ విషయం వినియోగదారులకు తెలిసేలా మందుల లేబుళ్లపై సమాచారాన్ని ముద్రించాలని ఔషధ కంపెనీలకు తెలిపింది. ఎఫ్‌డీసీ హేతుబద్ధ ఔషధమైనా చిన్న పిల్లల్లో దాని వినియోగం ఆమోద యోగ్యం కాదన్న నిపుణుల కమిటీ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించింది.

దివ్యాంగులను కించపరిచే పదాలు వాడొద్దు

పార్టీలకు ఈసీ సూచన

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం అడ్వైజరీ జారీ చేసింది. దివ్యాంగులను కించపరిచే మాటలను, పదాలను ఎట్టిపరిస్థితుల్లో వాడొద్దని.. వాటిని వాడితే వారిని అవమానించినట్టుగా భావించాల్సి వస్తుందని రాజకీయ నేతలను కోరింది. గుడ్డోడు, కుంటోడు, పిచ్చోడు, చెవిటోడు, మతిలేనోడు, అవిటోడు లాంటి పదాలను ప్రసంగాల్లో వాడటం వల్ల దివ్యాంగుల మనస్సులు తీవ్రంగా బాధపడతాయని, దీనిని నివారించడానికి ఇలాంటి పదాలు వాడరాదని, ఇక ముందు వినియోగిస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అరాచక శక్తులకు ఆశ్రయమే పెద్ద సమస్య

కెనడా వైఖరిపై భారత్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: అరాచక శక్తులకు ఆశ్రయమివ్వడం మాని, వారిపై చర్యలు తీసుకోవాలని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చీ కెనడాను కోరారు. సిక్కు వేర్పాటు వాది పన్నూ హత్యకు భారతీయుడు కుట్ర పన్నారని అమెరికా ఆరోపణలు చేసిన క్రమంలో భారత్ స్వరంలో మార్పు వచ్చిందని కెనడా ప్రధాని ట్రూడో చేసిన వ్యాఖ్యలపై బాగ్చీ మాట్లాడుతూ భారత వ్యతిరేక శక్తులపై కెనడా చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నామన్నారు.

పరిధి దాటుతున్న భారత అప్పులు

- జీడీపీలో 100 శాతం దాటే ప్రమాదం
- అదే జరిగితే దేశానికి ముప్పే
- అంతర్జాతీయ ద్రవ్య నిధి హెచ్చరిక
- భయపడాల్సిందేమీ లేదు: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 21: భారతదేశ అప్పులు పరిధి దాటిపోతున్నాయని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) హెచ్చరించింది. దేశ జీడీపీలో మీడియం టర్మ్ అప్పులు వంద శాతం కూడా దాటిపోయే ప్రమాదం ఉన్నదని తన వార్షిక నివేదికలో తెలిపింది. అదే జరిగితే దీర్ఘకాలంలో దేశానికి ఆర్థిక కష్టాలు తప్పవని హెచ్చరించింది. ఈ పరిస్థితిని అధిగమించాలంటే పెట్టుబడులు స్థిరంగా పెరగాలని భారత్‌లో ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేవీ సుబ్రమణియన్ పేర్కొన్నారు. 'చారిత్రక అంశాలపరంగా చూసినా, దేశానికి పొంచి ఉన్న పర్యావరణ, ప్రకృతి విపత్తుల పరంగా చూసినా దీర్ఘకాలంలో భారత్‌కు అప్పుల ముప్పు అధికంగానే ఉందన్నదే ఐఎంఎఫ్ ఉద్దేశం. అయితే విదేశీ అప్పుల సమస్య తక్కువే. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తగులుతున్న ఎదురుదెబ్బలను పరిగణనలోకి తీసుకొన్నప్పుడు దేశీయ అప్పులు కూడా సమస్యగానే మారే అవకాశం ఉన్నది. భారత జీడీపీలో పబ్లిక్ రుణాలు 2005-06లో 84 శాతం ఉంటే.. 2021-22 నాటికి 81 శాతానికి తగ్గాయి. ఆ మేరకు విదేశీ అప్పులు పెరిగాయి' అని ఐఎంఎఫ్ తన నివేదికలో వివరించింది. ఐఎంఎఫ్ నివేదికపై కేంద్రం స్పందించింది. విదేశీ రుణాలు తక్కువగా ఉన్నందున రుణ సమస్య పెద్దగా ఉండదని పేర్కొన్నది. 2023 మార్చి నాటికి కేంద్ర ప్రభుత్వ అప్పులు రూ.155.6 లక్షల కోట్లకు చేరాయి. ఇది దేశ జీడీపీలో 57.1 శాతం. అదే కాలానికి అన్ని రాష్ట్రాల అప్పులు కలిపి జీడీపీలో 28 శాతానికి చేరాయి. దేశానికి అప్పుల భారం తగ్గించేందుకు చర్యలు తీసుకొంటున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గత అక్టోబర్‌లో ప్రకటించారు.

మేజర్లకు ఆధార్ జారీకి వెరిఫికేషన్ తప్పనిసరి

లక్నో: 18 ఏండ్లు పైబడి మొదటిసారి ఆధార్ కోసం దరఖాస్తు చేసుకొన్న వారు రాష్ట్ర ప్రభుత్వ సమ్మతితో భౌతికంగా వెరిఫికేషన్ ప్రక్రియకు హాజరవ్వాలని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ప్రకటించింది. తొలిసారి ఆధార్ కోసం దరఖాస్తు చేసుకొనేవారి కోసం ప్రతి జిల్లాలోని ప్రధాన తపాల కార్యాలయంతో పాటు యూఐడీఏఐ గుర్తింపు పొందిన ఎంపిక చేసిన ఆధార్ కేంద్రాల్లో సేవలు అందిస్తామని చెప్పింది.

ఆస్తులతో ఆధార్ లింక్! ఢిల్లీ హైకోర్టులో పిల్

న్యూఢిల్లీ: అవినీతి నిరోధానికి, నల్లధనాన్ని అరికట్టడానికి, బినామీ లావాదేవీలకు అడ్డుకట్ట వేయడానికి ప్రజల స్థిర, చర ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను ఆధార్‌తో అనుసంధానం చేయాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై మూడు నెలల్లోగా ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్ర ఆర్థిక, న్యాయ, పట్టణ, గ్రామీణ శాఖ మంత్రులకు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

ఉగ్ర ఘాతుకం

- ఆర్మీ ట్రక్కులపై ఆకస్మిక దాడి
- ఐదుగురు జవాన్ల వీర మరణం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- కశ్మీర్‌లోని పూంఛ్‌లో ఘటన

ఉగ్రదాడిలో దెబ్బతిన్న సైనిక వాహనం

జమ్ము, డిసెంబర్ 21: జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడ్డారు. పూంఛ్ జిల్లాలో గురువారం మధ్యాహ్నం ఆర్మీ వాహనాలపై ఆకస్మిక దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు వీర మరణం పొందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. టెర్రరిస్టుల ఏరివేత ఆపరేషన్ కోసం డేరా కీ గలీ ప్రాంతానికి అదనపు సైనికులను తీసుకెళుతుండగా ధత్యర్ మోర్హ్ వద్ద ఈ దాడి జరిగింది. సైనికులు ప్రయాణిస్తున్న ట్రక్, జిప్సీపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారని, సైనికులకు చెందిన ఆయుధాలను వారు ఎత్తుకెళ్లి ఉంటారని భావిస్తున్నారు. ఉగ్రవాదులు ఉన్నారన్న నిఘా వర్గాల సమాచారం మేరకు బుధవారం రాత్రి నుంచి డేరా కీ గలీ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టామని, ఈ క్రమంలో ఎన్‌కౌంటర్ చోటు చేసుకున్నట్టు ఆర్మీ అధికార ప్రతినిధి తెలిపారు. ఘటనా స్థలానికి అదనపు బలగాలను తరలిస్తుండగా ముష్కరులు ఆకస్మిక దాడికి దిగినట్టు వివరించారు. ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్ కొనసాగుతున్నదని తెలిపారు. పూంఛ్ జిల్లాలో బుధవారం ఒక పోలీస్ యూనిట్ ప్రాంగణంలో పేలుడు సంభవించిన తర్వాత ఈ ఉగ్ర దాడి జరగడం గమనార్హం. గతంలో పలుమార్లు ఇదే ప్రాంతంలో ఈ తరహా కాల్పులు జరిగాయని ఆర్మీ తెలిపింది. గత రెండేండ్లలో ఈ ప్రాంతంలో జరిగిన ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్లలో 35 మంది సైనికులు చనిపోయారని వెల్లడించింది.

జన్మనిచ్చిన తల్లి కోసం పదేండ్లుగా అన్వేషణ!

ముంబై, డిసెంబర్ 21: తనకు జన్మనిచ్చిన తల్లి కోసం స్విట్జర్లాండ్ యువతి విద్యా ఫిలిప్పోన్ (26) పదేండ్ల నుంచి ముంబైలో అన్వేషిస్తున్నారు. విద్యను ఆమె తల్లి మిషనరీస్ ఆఫ్ చారిటీలో వదిలిపెట్టారు. అనంతరం ఆమెను స్విట్జర్లాండ్ జంట 1997లో దత్తత తీసుకున్నది. స్విట్జర్లాండ్‌లో పెరిగి, పెద్దయిన విద్య ఫిలిప్పోన్‌కు తన తల్లిని కలుసుకోవాలనే ఆత్రుత తీవ్రంగా ఉన్నది. అయితే ఆమె వద్ద ఉన్న సమాచారం కేవలం ఆమె ఇంటి పేరు, అప్పట్లో వారు నివసించిన ప్రాంతం చిరునామా మాత్రమే. ఆమె తన భర్తతో సహా ముంబైకి వచ్చి, మిషనరీస్ ఆఫ్ చారిటీ, రావల్ పడా, దహీసార్ ప్రాంతాల్లో తన తల్లి కోసం అన్వేషిస్తున్నారు. అడాప్టీ రైట్స్ కౌన్సిల్ డైరెక్టర్, న్యాయవాది అంజలీ పవార్ కూడా ఆమెకు సహాయపడుతున్నారు.

'గ్యారెంటీ'గా నిరుద్యోగులు బలి!

- కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో భారీగా ఉద్యోగుల కొరత
- 2.55 లక్షల పోస్టులు ఖాళీ
- నియామకాలు బంద్.. హామీలకు నిధులు డైవర్ట్
- ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోతున్న ఫైళ్లు

బెంగళూరు, డిసెంబర్ 21: ముందుచూపు లేకుండా, ఎన్నికల సమయంలో అలవికాని హామీలిచ్చి కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు వాటిని అమలు చేయలేక చేతులెత్తేస్తున్నది. సవాలక్ష కొర్రీలు విధిస్తున్నది. నిధులు సమీకరణకు నిరుద్యోగులను బలిచేస్తున్నది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న లక్షల పోస్టులను భర్తీ చేయకుండా, జీతభత్యాల సొమ్మును పథకాలకు మళ్లిస్తున్నది. దీంతో చాలావరకు ప్రభుత్వ శాఖల్లో సగానికి కంటే తక్కువ సిబ్బంది ఉన్నారు. వారిపై అధిక పని భారం పడుతున్నది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు.. ఇప్పుడు మాటతప్పడంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నవారిపై తీవ్ర ఒత్తిడి

కర్ణాటకలో వివిధ ప్రభుత్వ శాఖల్లో 2.55 లక్షలకు పైగా గ్రూప్-ఏ, గ్రూప్-డీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా రాష్ట్రంలోని చాలా శాఖలు సగం మంది సిబ్బందితోనే పని కానిచ్చేస్తున్నాయి. దీంతో అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్లు గుట్టలుగా పేరుకుపోతున్నాయని మైసూరుకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి వెల్లడించారు. నియామకాలు ఆగిపోవటంతో ఇతర ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి పడుతున్నదని తెలిపారు. మొత్తంగా రాష్ట్రంలో 7.72 లక్షల పోస్టులు ఉండగా, ప్రస్తుతం 5.16 లక్షల మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారని ప్రభుత్వ లెక్కలు చెప్తున్నాయి. ఆ పోస్టులే కాదు.. ఐఏఎస్ స్థాయిలోనూ చాలా వరకు పోస్టులు ఖాళీగా ఉండటం గమనార్హం.

**మరిన్